AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
16-1-2026 (Friday) MAIN EDITION

## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాదిని పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ పడిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తర భారత దేశంలో జనవరి 16 నుంచి చలిగాలులు వీస్తాయని, దట్టమైన పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఢిల్లీలో నెలకొన్న శీతల గాలుల పరిస్థితుల మధ్య కాలుష్య స్థాయిలు పెరిగాయి. జనవరి మధ్యలో ఉండాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తక్కువగా నమోదయ్యాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.

## బంగ్లాలో హిందువులపై కొనసాగుతున్న దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా సిల్హెట్‌లోని ఉపాధ్యాయుడు బీరేంద్ర కుమార్ డే ఇంటికి దుండగులు నిప్పంటించారు. మైమెన్ సింగ్, ఫిరోజ్‌పూర్, చిట్టగాంగ్‌లలో హిందూ కుటుంబాలే లక్ష్యంగా దాడులు, హత్యలు, దహనకాండలు జరుగుతున్నాయి. చిట్టగాంగ్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మందిని ఇంట్లో పెట్టి బయట లాక్ చేసి నిప్పు అంటించారు. ఆ కుటుంబం తృటిలో ప్రాణాలతో బయటపడింది.

## మేడారానికి పోటెత్తిన భక్తులు..



**అక్షరటుడే, ములుగు:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క–సారలమ్మ దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మేడారం మహా జాతర ఈ నెల 28 నుంచి 31 వరకు సాగనుంది. జాతర సమయంలో రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో పలువురు భక్తులు ముందుగానే దర్శనం చేసుకుంటున్నారు.

## సికింద్రాబాద్ పేరు మార్చే కుట్ర



**అక్షరటుడే, హైదరాబాద్:** మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బ తీస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సికింద్రాబాద్ చరిత్రను తుడిచిపెట్టే చర్యలను అడ్డుకుంటామన్నారు. సికింద్రాబాద్ పేరు మార్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

## ప్రభాకర్‌రావు బెయిల్‌పై విచారణ వాయిదా



**అక్షరటుడే, ఢిల్లీ:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మార్చి నెలకు వాయిదా వేసింది. తదుపరి విచారణ వరకు మధ్యంతర ఉపశమనం కల్పించింది. ఈ మేరకు జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకుని ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

## ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

**అక్షరటుడే, నాగర్‌కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ లారీ ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, బస్సులోని 9 మందికి గాయాలయ్యాయి. మృతుడు హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో పని చేస్తున్న రాజుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా.. ఈ ఘటనలో బస్సు తీవ్రంగా ధ్వంసమైంది.

## యువకుల బైక్ రేస్.. స్థానికుల దేహశుద్ధి

**అక్షరటుడే, ఏపీ:** బైక్ రేసులకు పాల్పడుతున్న యువకులను పట్టుకొని ప్రజలు దేహశుద్ధి చేశారు. ఏపీలోని సత్యసాయి జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. హిందూపురం మండలం కొల్లకుంట వద్ద బైక్ రేసింగ్ చేస్తూ యువకులు హల్‌చల్ చేశారు. ద్విచక్ర వాహనాలను ఒక టైర్‌పై లేపి రయ్యుమని దూసుకెళ్లారు. ఈ క్రమంలో మరో వాహనదారుడిని ఢీకొన్నారు. అనంతరం వారే బాధితుడిపై దాడి చేశారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున ప్రజలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రేసింగ్‌కు పాల్పడుతున్న యువకులను పట్టుకొని దేహశుద్ధి చేశారు.

**ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. స్పీకర్‌కు ఇదే చివరి అవకాశమని ఆగ్రహం వ్యక్తం చేసింది. లేదంటే తామే నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల విషయంలో సైతం రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. లేదంటే కీలక పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# ఇదే చివరి అవకాశం

- లేదంటే మేమే నిర్ణయం తీసుకుంటాం
- అనర్హత పిటిషన్లపై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- స్పీకర్ తీరుపై ఆగ్రహం

బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరిన విషయం తెలిసిందే. దీనిపై గులాబీ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వారిపై అనర్హత వేటు వేయాలని కోరింది. దీనిపై గతంలో విచాణ చేపట్టిన న్యాయస్థానం మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. అయినా స్పీకర్ ఇప్పటి వరకు ఏడుగురి అనర్హత పిటిషన్లపై మాత్రమే తీర్పు చెప్పారు. దీనిపై శుక్రవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం విచారించింది.

### కీలక పరిణామాలు ఉంటాయి

సుప్రీంకోర్టు తీర్పు మేరకు స్పీకర్ ప్రసాద్ కుమార్ అనర్హత పిటిషన్లపై విచారణ చేపట్టారు. 8 మంది ఎమ్మెల్యేలను విచారించారు. అందులో ఏడుగురు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. గతంలో ఐదుగురు ఎమ్మెల్యేలకు ఊరటనిచ్చిన ఆయన గురువారం మరో ఇద్దరు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య అనర్హత పిటిషన్లను కొట్టి వేశారు. అయితే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిటిషన్లపై స్పీకర్ ఇంత వరకు విచారణ జరపలేదు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై విచారణ పూర్తయిన ఇంకా స్పీకర్ తీర్పు ప్రకటించలేదు. వీరి అనర్హత పిటిషన్లపై సైతం నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. ఇప్పటికే తగిన సమయం ఇచ్చామని వ్యాఖ్యలు చేసింది. నిర్ణయం తీసుకోకుంటే కీలక పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది.

### రెండు వారాల్లో ..

మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకోని అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అనంతరం విచారణను రెండు వారాలు వాయిదా వేసింది.

కాగా పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఏడుగురికి స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. వారు కాంగ్రెస్‌లో చేరినట్లు ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. అయితే ఈ విచారణకు ఇంతవరకు కడియం శ్రీహరి, దానం నాగేందర్ హాజరు కాలేదు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విచారణ పూర్తయినా.. స్పీకర్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దానం నాగేందర్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. దీంతో ఆయనపై వేటు తప్పదనే ప్రచారం జరుగుతోంది. స్పీకర్ వేటు వేయకముందే ఆయన రాజీనామా చేస్తారని సమాచారం. కడియం శ్రీహరి, సంజయ్‌కుమార్ విషయంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.



## హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్



హైదరాబాద్ నగరంలోని గోల్కొండ కోట సమీపంలో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ ప్రారంభమైంది. పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఏరియల్ రైడ్‌ను చేపట్టారు. గోల్ఫ్ క్లబ్ ప్రాంగణంలోని గోల్కొండ ఫోర్ట్ సమీపంలో శుక్రవారం ఉదయం హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ ఘనంగా ప్రారంభమైంది. మంత్రి జూపల్లి ఫెస్టివల్‌ను ప్రారంభించి బెలూన్‌లో పర్యటించారు. దాదాపు ఒకటిన్నర గంటలు గాలిలో గడిపారు. ఈ అనుభవాన్ని చిరస్మరణీయమైనదిగా మంత్రి అభివర్ణించారు. ఈ చొరవ రాష్ట్ర పర్యాటక ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందన్నారు. హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్స్ వంటి కార్యక్రమాలు ఆధునిక సాంకేతికత, భవిష్యత్తు ఆధారిత దృక్పథాన్ని ప్రదర్శిస్తాయని చెప్పారు. **–అక్షరటుడే, హైదరాబాద్**

## వేములవాడను పట్టించుకోని కేసీఆర్: సీతక్క



**అక్షరటుడే, వేములవాడ:** కేసీఆర్ హయాంలో వేములవాడ రాజన్న, మేడారం ఆలయాలను పట్టించుకోలేదని మంత్రి సీతక్క ఆరోపించారు. శుక్రవారం ఉదయం ఆమె వేములవాడలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ ఆలయాన్ని దర్శించుకున్నారు. రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 19న మేడారంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సమ్మక్క సారలమ్మ గద్దెల పునః ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని రాజన్నను వేడుకున్నట్లు మంత్రి చెప్పారు. సమ్మక్క సారలమ్మ గుడిని సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. వేములవాడలో సైతం అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు.

## కశ్మీర్ గురించి మాట్లాడిన పాక్.. ఆగ్రహం వ్యక్తం చేసిన భారత్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ మరోసారి ఐక్యరాజ్య సమితిలో జమ్మూకశ్మీర్ ప్రస్తావన తీసుకురాగా.. భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దాయాది దేశానికి బుద్ధి చెప్పింది. జనరల్ అసెంబ్లీలో ఇస్లామాబాద్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. పాకిస్థాన్ తన విభజన ఎజెండాను అమలు చేయడానికి యూఎన్ వేదికలను దుర్వినియోగం చేస్తోందని భారత్ వ్యాఖ్యానించింది. ప్రజాస్వామ్య దేశాలలో వేర్పాటును ప్రోత్సహించడానికి స్వయం నిర్ణయాధికార హక్కును దుర్వినియోగం చేయకూడదని యూఎన్‌కు భారత శాశ్వత మిషన్‌లో కౌన్సెలర్ ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ అన్నారు. పాక్ తమ విభజన ఎజెండాను నడపడానికి ఐరాసలోని అన్ని వేదికలు, ప్రక్రియలను దుర్వినియోగం చేస్తూనే ఉందని మండిపడ్డారు.

## 'చనక కొరాట' ఎత్తిపోతలను ప్రారంభించిన సీఎం

**అక్షరటుడే, ఆదిలాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. చనక కొరాట ఎత్తిపోతల పథకం, సదర్మట్ బ్యారేజీలను ప్రారంభించి రైతులకు సాగునీరు విడుదల చేశారు. ఆదిలాబాద్ జిల్లా బోరాజ్ మండలంలోని హాతిఘాట్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చనక కొరాట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక హెలికాప్టర్‌లో సీఎం హెలిప్యాడ్‌లో దిగారు. అనంతరం రోడ్డు మార్గంలో వెళ్లి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం నిర్మల్ జిల్లాకు చేరుకున్నారు. పొంకల్ గ్రామంలో సదర్మట్ బ్యారేజీని ప్రారంభించి యాసంగి పంటకు నీటిని విడుదల చేశారు. నిర్మల్ జిల్లా నాయకులు సీఎంకు ఘన స్వాగతం పలికారు.



బాసర సరస్వతీ అమ్మవారి చిత్రపటం బహూకరించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## 20న బీజేపీ జాతీయ అధ్యక్షుడి ప్రకటన

**అక్షరటుడే, ఢిల్లీ:** బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఈ నెల 20న ప్రకటించనున్నట్లు పార్టీ తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కాగా అధ్యక్షుడిగా నితిన్ నబీన్ పేరును ఖరారు చేసిన విషయం తెలిసిందే. బీహార్‌కు చెందిన నితిన్ నబీన్‌ను బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గత నెలలో నియమించిన విషయం తెలిసిందే. జనవరి 20న జేపీ నడ్డా తర్వాత అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. జనవరి 19న ఆయన అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తారు. జనవరి 20న అధ్యక్షుడిగా ఆయనను ప్రకటించనున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులందరూ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు, సీనియర్ బీజేపీ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

## సాయిపల్లవి డెబ్యూ మూవీపై వివాదం..



**దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న హీరోయిన్ సాయి పల్లవి.. ఇప్పుడు మరో కీలక అడుగు వేస్తోంది. తాజాగా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమైంది. కన్నడను మినహాయిస్తే దాదాపు అన్ని ప్రధాన దక్షిణాది భాషల్లో నటించిన సాయి పల్లవి, హిందీ చిత్ర పరిశ్రమలో తన తొలి చిత్రంగా 'ఏక్ దిన్' సినిమాను ఎంపిక చేసుకుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సంక్రాంతి సందర్భంగా విడుదల చేశారు. అయితే పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో అనూహ్యమైన చర్చ మొదలైంది. సినిమా టైటిల్‌తో పాటు పోస్టర్ డిజైన్ 2016లో విడుదలైన థాయ్ రొమాంటిక్ డ్రామా 'వన్ డే'ను పోలి ఉందని నెటిజన్లు వ్యాఖ్యానించారు. దీంతో కొంతమంది ఇది కాపీ సినిమా అంటూ విమర్శలు గుప్పించగా, మరికొందరు సృజనాత్మకత లోపించిందంటూ సెటైర్లు వేశారు. ఈ విమర్శలపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక స్పందన లేదు.**

**–అక్షరటుడే, సినిమాడెస్క్**